క్లుప్తంగా

పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించొద్దు

● జేడీఎస్ రాష్ట్ర కార్యదర్శి వాసు

కమలాపూర్ : ఏ పార్టీ అధికారంలో ఉన్నా పత్రికా స్వేచ్ఛకు భంగం కలుగకుండా చూడాల్సిన బాధ్యత ఆయా ప్రభుత్వాలపై ఉంటుందని జనతాదళ్ (సెక్యులర్) జేడీఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి వాసు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'సాక్షి' తెలుగు దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ముందస్తు సమాచారం లేకుండా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ దాడులు, సోదాలు నిర్వహించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ధనుంజయరెడ్డి ఇంటిపై జరిగిన దాడి పత్రికా స్వేచ్ఛపై జరిగిన దాడి అని అభిప్రాయపడ్డారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

శాయంపేట : మండల కేంద్రంలోని 33.11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగనుందని ఏఈ చందులాల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దామెర : మండలంలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ గుర్రం రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను ఉయదం 9 గంటల నుంచి 11 గంటల వరకు నిలిపివేయనున్నట్లు తెలిపారు. దామెర, సింగరాజుపల్లి, ల్యాదెళ్ల, వెంకటాపూర్, ఒగ్లాపూర్, దమ్మన్నపేట్, తక్కళ్లపహాడ్, ముస్త్యాలపల్లి గ్రామాల గృహ, వాణిజ్య, వ్యవసాయ, పారిశ్రామిక వినియోగదారులు సహకరించాలని కోరారు.

కమలాపూర్ : విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపూర్, వంగపల్లి, గూడూరు, దేశరాజుపల్లి గ్రామాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు తెలిపారు. వినియోదారులు విద్యుత్‌శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

త్రిఫేజ్‌కు అంతరాయం

వేలేరు : మండలంలోని పీచర, ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి సబ్ స్టేషన్‌లలో అత్యవసర మరమ్మతుల కారణంగా సబ్ స్టేషన్ పరిధిలోని ఆయా గ్రామాలకు, అన్ని ఫీడర్‌లకు త్రీఫేజ్ సరాఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ కుమారస్వామి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటల నుంచి 11.30 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తాం



దామెర : బాధిత కుటుంబాలకు అండగా నిలుస్తామని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మండలంలోని పులుకుర్తికి చెందిన వీరరౌతు భాస్కర్‌రెడ్డి తల్లి సులోచన శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ధర్మారెడ్డి సులోచన మృతదేహంపై పూలమావేసి నివాళులర్పించారు. అదే విధంగా ఇటీవల మృతి చెందిన ఎడ్ల ఆదయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శంకర్, వైస్ ఎంపీపీ జాకిర్‌అలీ, మాజీ జెడ్పీటీసీ కల్పన కృష్ణమూర్తి, కార్పొరేటర్ శివ ఉన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



వర్ధన్నపేట : బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. మండలంలోని కట్ర్యాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 'స్నేహ' గ్రూప్ సెషన్‌లో భాగంగా బాలికలకు ఏర్పాటు చేసిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాలు ఆరోగ్యానికి చేటని చెప్పారు. బాల్యవివాహం వల్ల పునరుత్పత్తి, ఆరోగ్యం, ప్రభావాలు, కేరీర్ తదితర అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ దుష్ప్రభావాలు, ఇతర అంశాలు వివరించారు. బాలికలు, మహిళలు ఏవైనా సమస్యలు తలెత్తితే 1098, 181, 100, 1930, 14567, 155326 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించి రక్షణ పొందాలని సూచించారు. బాధిత మహిళలు, బాలికలకు పోలీసులు, చైల్డ్‌లైన్ ప్రతినిధులు అండగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో సీసీ స్వామి, ఎస్‌హెచ్‌జీ సీఏ స్వప్న, మంజుల, అంగన్‌వాడీ టీచర్ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

మహిమాన్వితుడు మత్స్యగిరి స్వామి

- కాకతీయుల కళా వైభవానికి ప్రతీక
- రాష్ట్రంలోనే రెండో పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి
- నేటి నుంచి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు
- ముస్తాబైన ఆలయం



తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు చలువ పందిర్లతో ముసాబైన ఆలయం

శాయంపేట : మండల కేంద్రంలోని శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయం భక్తుల కోర్కెలు తీర్చే దైవమని పలువురు భక్తుల నమ్మకం. కాకతీయ రాజుల కళా వైభవానికి ప్రతికగా నిలిచిన మత్స్యగిరి స్వామి ఆలయం ప్రతి ఏడాది వైశాఖ శుద్ధ పౌర్ణమి, పంచమ రాత్రి ఆగమశాస్త్రం ప్రకారం స్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈ సందర్భంగా అర్చకులు తెలుపుతున్నారు.

ఆలయ చరిత్ర

శాయంపేట గ్రామంలోని మచ్చర్లగుట్టపై 569 సంవత్సరాల క్రితం శ్రీమత్స్యగిరి స్వామి కొలువుదీరినట్లు పూర్వీకులు పేర్కొంటున్నారు. మహా విష్ణువు దుష్టశిక్షణకై దశవతాకాలంలో భాగంగా మొదట మత్స్యవతారంగా వెలసినట్లు చెబుతుంటారు. మచ్చర్లయ్య గుట్ట వద్ద గ్రామ్య భాషలో శాలివాహన శకంలో ఏర్పాటు చేసినట్లు శిలాశాసనం ద్వారా ఆనాటి దేవాలయ చరిత్ర తెలియజేస్తుంది. గుట్ట లోపల బండరాయిపై సహజ సిద్ధంగా మచ్చా అవతారంలో స్వామివారు దర్శనం ఇస్తారు. గుట్ట లోపలికి వెళ్లేందుకు ఒకే చిన్న సొరంగ మార్గం ఉంటుంది. ఇక్కడ 14 దేవాలయాలు, 24 మంది అర్చకులు ఉండేవారని ఈ శిలాశాసనం తెలుపుతోంది. అప్పుడు నిర్మించిన దేవుని చెరువు నేటికి అదే పేరుతో పిలువబడుతుంది. కాకతీయ సామంతరాజు కొత్తగట్టు సీమ పాలకుడు, రేచర్ల దర్శనాయుడు తన తల్లిదండ్రులు సింగమాంబ, సింగమనాయుడు దేవాలయం నిర్మించినట్లు చరిత్ర తెలుపుతోంది. కాలక్రమంలో మచ్చర్లయ్య గుట్ట వద్ద నుంచి గ్రామం దూరంగా వెళ్లిందని, గ్రామం మధ్యలో రాతితో శ్రీమత్స్యగిరి స్వామి దేవాలయాన్ని నిర్మించినట్లు పలువురు పూర్వికులు అంటున్నారు. దేవాలయ గోపురం పైన మహా విష్ణువు దశావతారాలు భక్తులకు దర్శనమిస్తాయి.



మచ్చర్లయ్య గుట్ట వద్ద ముస్తాబైన ఆలయం

తిరుకల్యాణానికి ముస్తాబు

మండల కేంద్రంలోని అతి పురాతనమైన శ్రీమత్స్యగిరి స్వామి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ప్రారంభమవుతుండంతో ఆలయ ప్రాగణంలో చలువ పందిళ్లు ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు. నేడు అధ్యాయనోత్సవం, తొళ్లకం ప్రారంభం, పుట్ట బంగారు సేవా, ధ్వజారోహణం, గరుడముద్ద, 11వ తేదీన (ఆదివారం) శ్రీ మత్స్యగిరి స్వామి కల్యాణోత్సవం, మధ్యాహ్నం మహా అన్నదానం, 12వ తేదీన సోమవారం పూర్ణాహుతి సాయంత్రం గజవాహన సేవ (గుట్ట మీదకు పోవుట), 13న (మంగళవారం) రథోత్సవం, అలుకతీరుట, సాంస్కృతిక కార్యక్రమాలు, 14న (బుధవారం) చక్రవర్తి, నాకబలి(నాగవల్లి), పండిత సన్మానంతో తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ చైర్మన్ సామల భిక్షపతి పిలుపునిచ్చారు.

కరెంట్ పోతే కట్..

● మెరాయిస్తున్న బీఎస్ఎన్ఎల్ సిగ్నల్స్



నడికూడ : మండల కేంద్రంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఉన్నప్పటికీ కొన్ని నెలల నుంచి అధికారులు టవర్ మెయింటనెన్స్ పట్టించుకోకపోవడంతో బ్యాటరీలు డ్రై అయ్యి పనిచేయడం లేదు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే గంట వరకు సిగ్నల్స్ రావడం లేదని వినియోగదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బీఎస్ఎన్ఎల్ చాలా ప్రాంతాలకు 4జీ నెట్‌వర్క్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. మండలంలో కనీసం ఫోన్లు చేసుకునేందుకు కూడా సిగ్నల్స్ రావడం లేదని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. అదే టవర్‌ను అద్దకు తీసుకున్న ఇతర ప్రైవేట్ టెలికాం సంస్థలు సర్వీస్ సక్రమంగా అందిస్తున్నాయని, కేవలం బీఎస్ఎన్ఎల్ అధికారుల నిర్లక్ష్యం వలనే తరుచుగా సిగ్నల్స్ సమస్య తలెత్తుతుండనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు. లేనిపక్షంలో బీఎస్ఎన్ఎల్ టవర్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



దామెర : మండలంలోని ముస్త్యాలపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భూలక్ష్మి, పోచమ్మ, పోతరాజు విగ్రహాలను ప్రతిష్ఠించి యంత్రపూజ నిర్వహించారు. అనంతరం విశ్వకర్మ కిష్టోజు రవీంద్రాచార్యులు వేద మంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ముత్యం, పగడం, బంగారం, నాణాలు, నవధాన్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బలి కార్యక్రమం పూర్తి అయ్యే వరకు గ్రామానికి రాకపోకలు నిలిపివేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాదరావు, మండల అధ్యక్షుడు వేల్పుల రాజ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు చంద్రకిరణ్, నరేష్, నాగేందర్, కాకతీయ విశ్వవిద్యాలయం తెలంగాణ ఉద్యమ నాయకుడు మంద వీరస్వామి, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు తదితరులు వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

● ఎంపీడీఓ ఆంజనేయులు



మాట్లాడుతున్న ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు

పరకాల : మండలంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు కార్యచరణ రూపొందించుకోవాలని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో కన్వర్జెన్స్ సమావేశానికి ఏంఈఓ రమాదేవి అధ్యక్షతన వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విశాలమైన గదులు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు క్రీడలకు విశాలమైన స్థలాలు ఉంటాయని అన్నారు. ఈ విషయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులతో పాటు మహిళ సంఘాలు, బాధ్యతాయుతమైన వ్యక్తులు కృషి చేయాలని కోరారు. ఏపీఎం క్రాంతి, మండల నోడల్ అధికారి నామాని సాంబయ్య, ప్రధానోపాధ్యాయులు సురేందర్, మధు, ప్రధానోపాధ్యాయులు, మహిళా సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఐనవోలు : అర్హత లేని వారికి ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తున్నారని ఐనవోలు గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన నాయకులు పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. శుక్రవారం గ్రామంలో సమావేశమైన నాయకులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. ఇళ్ల కేటాయింపుతో అర్హులకు అన్యాయం జరుగుతుందన్నారు. అయితే బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ, డీఎస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు అధికార పార్టీకి చెందిన నాయకులు కూడా పాల్గొనడం గమనార్హం. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు కుమార్, మహేశ్వర్ గౌడ్, సామ్య, విష్ణువర్ధన్, అశోక్, దిలీప్, కుమార్, అనిల్, ప్రశాంత్, ఏలియా, అశోక్, రఘువంశీ, లక్ష్మణ్, సుదీప్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



పరకాల : కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు



కమలాపూర్ : ఎంపీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి

పరకాల : కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు పూనుకుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చక్రపాణి ఆరోపించారు. ఆ విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 20వ తేదీన చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పరకాల కూరగాయల మార్కెట్లో సమ్మెకు సంబంధించిన కరపత్రాన్ని వ్యాపారస్తులకు, కార్మికులకు పంపిణీ చేశారు. హమాలీ సంఘం నాయకులు సాంబయ్య, మోహన్, రాజమౌళి, రాజు, రమేశ్, జంపయ్య పాల్గొన్నారు.

కమలాపూర్ : జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్ల జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపు మేరకు ఈనెల 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొననున్నట్లు తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు కమలాపూర్ మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకుడు కరణ్, ఎంపీఓ చైతన్యకుమార్ రెడ్డికి శుక్రవారం సమ్మె నోటీస్ అందించారు. అదే విధంగా ఎండ తీవ్రత పెరుగుతున్న కారణంగా గ్రామపంచాయతీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎండ తీవ్రత తగ్గే వరకు కార్మికుల పని గంటలు తగ్గించి ఒక్కపూట (ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు) పనికి అనుమతి ఇవ్వాలని వినతిలో కోరారు. అంతకుముందు ఈనెల 20వ తేదీన జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్లను స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు బొట్ల చక్రపాణి, జిల్లా ఉపాధ్యక్షుడు మాట్ల భాస్కర్, మండల అధ్యక్షుడు ఇసంపెల్లి ఐలయ్య, కార్యవర్గ సభ్యులు శనిగరపు పురుషోత్తం, ఒస్కుల రమేశ్, అరుణ, మేకల అరుణ, జి.సుశీల, పి.శ్రీదేవి పాల్గొన్నారు.

కాంగ్రెస్ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా కృష్ణారెడ్డి

వర్ధన్నపేట : పట్టణానికి చెందిన అనిమిరెడ్డి కృష్ణారెడ్డిని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియమించినట్లు స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ప్రకటించారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ జయకేతనం ఎగరేసేలా కార్యాచరణ అమలు చేసేందుకు ముందస్తుగా కృష్ణారెడ్డి నియామకం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణ, భూక్యా శ్రీలత, నాయకులు రామ్ నాయక్, సిలివేరు శ్రీధర్, పులి శ్రీనివాస్, చందు రవి తదితరులు పాల్గొన్నారు. కాగా కృష్ణారెడ్డిని పలువురు అభినందించారు.

అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు

● కాలిపోయిన మొక్కలు



కాలుతున్న అవెన్యూ ప్లాంటేషన్

శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామ శివారులో గల అవెన్యూ ప్లాంటేషన్‌లో మంటలు చెలరేగాయి. రైతులు కంకులు ఆరబోసి మిషన్‌లో వేసి జొన్నలు పట్టిన అనంతరం కంకి పొట్టును, బెండ్లను రోడ్డు పక్కన పడేయడంతో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెడుతున్నట్లు సమాచారం. దీంతో గత ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి అవెన్యూ ప్లాంటేషన్‌లో నాటిన మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. శుక్రవారం దాదాపు అర కిలోమీటర్ మేర నాటిన మొక్కలు దగ్ధమయ్యాయి. అయితే కావాలనే మక్కబెండ్లకు నిప్పు పెడుతూ మొక్కలను కాలుస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

చూసీచూడనట్లు..

ఈనెల 7వ తేదీన అవెన్యూ ప్లాంటేషన్‌లో నిప్పులు చెలరేగినా జిల్లా అధికారులు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదని, ఇప్పటికైనా స్పందించి ప్లాంటేషన్‌ను కాపాడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలి..



ఐనవోలు : మండల కేంద్రంలోని మల్లికార్జున స్వామి దేవస్థాన ఆవరణలో నూతనంగా నిర్మించిన ఎల్లమ్మ దేవాలయంలో ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, అర్చకులు తెలిపారు. ఈ మేరకు ప్రతిష్ఠాపనకు రావాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి ఆహ్వానపత్రం అందించారు. ఈనెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, అర్చకులు శ్రీనివాస్, భానుప్రసాద్ పాల్గొన్నారు.

పంట సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి



ఎల్కతుర్తి : మాట్లాడుతున్న అధికారులు



ఐనవోలు : వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి : పంట సాగులో సస్యరక్షణ చర్యలు పాటించి అధిక దిగుబడి పొందాలని శాస్త్రవేత్త యశశ్విని సూచించారు. మండలంలోని దండేపల్లి గ్రామంలో శుక్రవారం 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడారు. పంట పొలాల్లో తక్కువ యూరియా వినియోగించి సాగు ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. అవసరం మేరకు పురుగు మందులను వినియోగించాలని, నేల తల్లి ఆరోగ్యాన్ని కాపాడాలని, మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రైతులు రశీదు తీసుకుని భద్రపరుచుకోవాలని అన్నారు. సాగు నీటిని అవసరం మేరకే వినియోగించుకోవాలన్నారు. వ్యవసాయ భూముల్లో ప్రతీసారి ఒకే రకమైన పంటను సాగు చేయకుండా పంట మార్పిడి చేయాలన్నారు. అనంతరం డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. వరిలో సాగు చేయాల్సిన స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక రకాల గురించి రైతులకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల పథకాలపై ఏఓ రాజ్ కుమార్ రైతులకు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అఖిల, అభ్యోదయ రైతు కృష్ణంరాజు, రైతులు సంపత్, సందీప్, గంగాధర్, బాబు, శ్రీనివాస్, రమణారెడ్డి, శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

ఐనవోలు : పంట మార్పిడిపై ప్రత్యేకదృష్టి సారించాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ ప్రొఫెసర్లు హరికృష్ణ, గోపిక అన్నారు. శుక్రవారం మండలంలోని నందనం గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మెట్ట భూమిలో సాగు చేసిన పంటల్లో పత్తి తర్వాత నేల రకము, నీటి వసతిని బట్టి శనగ, పెసర, మినుము, మొక్కజొన్న, వేసవి కంది, ప్రొద్దుతిరుగుడు, నువ్వులు, పచ్చిజొన్న తదితర పంటలను సాగు చేయాలని సూచించారు. తద్వారా చీడ పీడల ఉధృతి తగ్గడమే కాకుండా నేల ఆరోగ్యం మెరుగు పడుతుందన్నారు. అనంతరం వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఏఓ సునీల్‌కుమార్, ఏఈఓ హీనా కౌసర్, ఎఫ్ఎస్‌సీఎస్ వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి రవీందర్‌రావు, రైతులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి కృషి

● కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి



భూమిపూజ చేస్తున్న కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి

ఆత్మకూరు : మండల కేంద్రంలో రేణుకా ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి కృషి చేస్తానని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ ఆలయ నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆలయాలు నిర్మించుకోవడం శుభపరిణామమని అన్నారు. ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. అనంతరం బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాదరావు మాట్లాడుతూ.. గ్రామంలో ఎల్లమ్మ తల్లి ఆలయం నిర్మించడం సంతోషకరమన్నారు. ఆలయ నిర్మాణానికి తనవంతు కృషిచేస్తానని అన్నారు. గౌడ సంఘం పెద్దలు కొమురయ్య, ప్రభాకర్, రమేశ్, పైడి, రమేశ్, గౌడసంఘం నాయకులు ప్రభాకర్, సంతోశ్, రాజు, భాస్కర్, రాజేందర్, సొసైటీ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాజు, సామెల్, కిశోర్‌కుమార్, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కుమారస్వామి, జైపాల్‌రెడ్డి, రవి, కిరీటితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారి పల్లకి సేవలో భక్తులు

ఆత్మకూరు : మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో మహిమాన్విత శ్రీరుక్మిణీసత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి ఆధ్వర్యంలో శుక్రవారం గరుడ హోమం, ధ్వజారోహణం, భేరీ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి సేవా ఉత్సవం, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శనివారం ఆలయంలో శ్రీవేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం జరుగనుందని భక్తులు హాజరుకావాలని అర్చకులు కోరారు.

కూలీలకు ఉపాధి కల్పించాలి

● డీఆర్డీఓ మేన శ్రీను



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న మేన శ్రీను

ఆత్మకూరు : ఉపాధి హామీ పథకంలో భాగంగా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించే విధంగా సిబ్బంది కృషి చేయాలని డీఆర్డీఓ, అడిషనల్ కలెక్టర్ మేన శ్రీను అన్నారు. మండలంలోని గుడెప్పాడ్ పరిధిలో ఉపాధి హామీ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామపంచాయతీలో ఉన్న జాబ్‌కార్డుల ఆధారంగా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి రోజు రూ.300 నుంచి రూ.307 వచ్చే విధంగా కొలతలు ఇచ్చి వాటి ప్రకారం పని జరిగేలా చూడాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉదయం 6 గంటలకే పనులు చేపట్టాలని అన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ కాకముందే పనులు ముగించుకోవాలని సూచించారు. పని తక్కువ జరిగితే సాయంత్రం వచ్చి పూర్తి చేసుకోవాలని కూలీలకు సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలకు తగు రక్షణ చర్యలు చేపట్టాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీఓ రాజిరెడ్డి, సిబ్బంది రాము, క్రాంతికుమార్, సురేశ్, రాజుప్రసాద్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించేందుకే 'భూ భారతి'

● తహసీల్దార్ నాగరాజు



దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగరాజు

నడికూడ : భూ సమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం భూ భారతి చట్టానికి శ్రీకారం చుట్టినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. మండలంలోని రాయపర్తి, నార్లపూర్ గ్రామాల్లో శుక్రవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. భూ సమస్యలపై స్వీకరించిన దరఖాస్తులను భూ భారతి చట్టం ద్వారా క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. రాయపర్తిలో 152 ,నార్లపూర్‌లో 158 దరఖాస్తులు స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

నడికూడ : గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఫైనాన్స్ డైరెక్టర్ దివ్యకు, ప్రాణాళిక సంఘం అధ్యక్షుడు చిన్నారెడ్డికి, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందించినట్లు తెలిపారు.